
## గడప,గడపకూ ఎన్నికల ప్రచారం





# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 06 ఫిబ్రవరి, 2026 | పేజీలు :08


# పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** ఈ నెల 11 వ తేదీన మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్న సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య హై స్కూల్ లో ఏర్పాటు చేసిన పలు కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు. దివ్యాంగులకు ర్యాంప్, పోలింగ్ అధికారులు, సిబ్బందికి తాగునీరు, టాయిలెట్స్ అన్ని వసతులు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

**టైమ్ ప్రకారం చదవాలి..**

పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు టైమ్ ట్రేమ్ ప్రకారం చదవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కుసుమ రామయ్య హై స్కూల్ లో పదో తరగతి విద్యార్థులకు తరగతులు కొనసాగుతుండగా, ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. మొత్తం ఎందరు విద్యార్థులు చదువుతున్నారు? ఈ రోజు తరగతికి ఎందరు హాజరయ్యారో ఆరా తీశారు. విద్యార్థులు అందరూ తరగతికి వచ్చేలా ఉపాధ్యాయులు చూసుకో వాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. జీవ శాస్త్రం టీచర్ బోధిస్తుండగా.. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని స్పష్టం చేశారు. అన్ని పరీక్షలకు సంబంధించిన టైమ్ ట్రేమ్ సిద్ధం చేసుకోవాలని,ఏ వారం ఏ సబ్జెక్ట్ చదవాలో ముందే రాసుకోవాలని, దానికి అనుగుణంగా అన్ని సబ్జెక్టులు చదవడం,రాయడం పూర్తి చేయాలని తెలిపారు. గత పదేండ్ల ప్రశ్నాపత్రాలు సాధన చేయాలని పేర్కొన్నారు. రాసిన సమాధానాలు ఒకసారి చెక్ చేసి ఎక్కడయినా లోపాలు, తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని, ప్రతి రోజూ స్టడీ హావర్ తో పాటుగా సెల్ఫ్ స్టడీ రోజు 3 నుంచి 4 గంటల పాటు చేయాలని సూచించారు. మార్చి 10వ తేదీ వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రాక్టీసు టెస్ట్ లు, రివిజన్ పూర్తి



చేయాలని సూచించారు. విద్యార్థు లందరూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు,వృత్తుల్లో స్థిరపడాలని,ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

### బ్యాలెట్ పేపర్ల ముద్రణ
# నిర్ణీత గడువులోగా పూర్తి



కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్:**మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి, బ్యాలెట్ పేపర్ల ముద్రణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో గల విజయ్ ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్‌లో, మున్సిపల్ ఎన్నికల బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రక్రియను,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైనన్ని బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణలో ఎటువంటి లోపాలు తలెత్తకూడదని పేర్కొన్నారు. అనధికార వ్యక్తులను ఎవరిని ముద్రణ కేంద్రంలోకి అనుమతించకూడదని చెప్పారు. ముద్రణ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేంతవరకు పటిష్ట పోలీసు బందోబస్తు కొనసాగించాలిన వివరించారు. బ్యాలెట్ పేపర్ ముద్రణ విధులు కేటాయించిన సిబ్బంది, ముద్రణ తీరును మొత్తం క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జెడ్పీ సీఈవో శంకర్, ఉద్యానవన పంటల అధికారి రమణ, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

### రేవంత్‌రెడ్డి... శ్వేత పత్రం
# విడుదల చేయగలరా..?

మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్:** కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో కరీంనగర్ కు రూ.1400 కోట్లు ఇచ్చానంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలాడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సీఎంకు నిజంగా దమ్ముంటే ఆ నిధులు ఎప్పుడు ఇచ్చారు? ఏయే అభివృద్ధి పనులకు ఖర్చు చేశారు? అనే వివరాలతో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ‘నన్ను కోసినా నయాపైసా లేదు’అని పదేపదే చెప్పిన రేవంత్ రెడ్డికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో కేసీఆర్, కేటీఆర్ లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని కేంద్రాన్ని నిందించడం విచిత్రంగా ఉందన్నారు. రేవంత్ రెడ్డి మీలో రోశం, పౌరుషం చచ్చిపోయిందా..? కేసీఆర్ పంపే మూటలతోనే ఢిల్లీకి పంపి సీఎం సీటును కాపాడుకుంటున్నారా..? అందుకే ఆ కుటుంబాన్ని అరెస్ట్ చేయలేకపోతున్నానని ఒప్పుకుంటే చెప్పండి... కేసీఆర్ కుటుంబం సంగతి మేం చూస్తాం. మా భుజం మీద తుపాకీ పెట్టి ఇతరులను కాలుద్దామంటే,ఆ ట్రాప్ లో ఇరుక్కోవడానికి మేం సిద్ధంగా లేం. సీఎంకు రోషం, పౌరుషం చచ్చిపోయిందని ఒప్పుకుంటారా..? కేసీఆర్ పంపే మూటలను ఢిల్లీకి పంపి సీఎం సీటును కాపాడుకుంటున్నారా? అందుకే కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయలేకపోతున్నానని ఒప్పుకుంటారా..? మీకు చేతగాదని ఒప్పుకుంటే కేసీఆర్ కుటుంబం సంగతి మేం చూస్తాంఅని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం బొమ్మకల్ అంబేద్కర్ విగ్రహంవద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. 6, 34 డివిజన్ల అభ్యర్థుల పక్షాన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఇయాళ కరీంనగర్ కు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆయన ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేశారా? మహిళలకు రూ.2500లు, తులం బంగారం, స్కూటీ, అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలిచ్చారా..? కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.1500 కోట్లు తెచ్చిన. ఏయే పనులు చేశానో వివరాలతోసహా బుక్ లెట్ ప్రింట్ చేయించి ఇంటింటికీ పంపుతున్నా. మొన్నటికి మొన్న నీళ్ల కోసం రూ.134 కోట్లు తెచ్చిన, ఇదిగాకుండా కార్పొరేషన్ కు మరో రూ.50 కోట్లు తెచ్చిన. ఇయాళ కరీంనగర్ కు వచ్చిన రేవంత్ రెడ్డి వచ్చి బండి సంజయ్ 7 రూపాయలైనా తెచ్చాడా? అని అడుగుతున్నడు. నేను చేసిన అభివృద్ధి, తెచ్చిన నిధుల వివరాలన్నీ బుక్ లెట్ రూపంలో మీ ఇంటికి పంపుతున్నా. సచివాలయానికి పంపుతా చదువుకో అని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నయాపైసా ఇయ్యని రేవంత్ రెడ్డి కరీంనగర్ కు రూ.1400 కోట్లు ఇచ్చినట్లు చెప్పడం విడ్డూరం. అంతేగాకుండా కరీంనగర్ ను వరంగల్ ను జంటనగరాలుగా మారుస్తానని, డంప్ యార్డ్ ను తరలిస్తానని చెప్పడం పెద్ద జోక్, రేవంత్ రెడ్డికి దమ్ముంటే, కరీంనగర్ కు రెండేళ్లలో ఎన్ని నిధులు ఇచ్చారు..? ఏయే అభివృద్ధి పనులు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.



# బిజెపిని గెలిపించిన వెంటనే రూ.లు 500 కోట్లు తెస్తా

**ప్రజాపక్షం/హుజురాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని గెలిపిస్తే రాష్ట్రానికి రూ.లు 500కోట్లు నిధులు తీసుకొస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం హుజురాబాద్ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ఎన్నికల ఇంచార్జీ ఎర్రం మహేష్ సహా నేతలు సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ తమకు మోసపు మాటలు చెప్పటం చేతకాదని, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మాదిరిగా దొంగ హామీలు ఇవ్వలేమని చెప్పారు. మాట ఇచ్చామంటే తప్పకుండా నెరవేర్చితీరుతామని అన్నారు. హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బిజెపికి అప్పగిస్తే ఢిల్లీకి పోయి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి హుజురాబాద్ పట్టణం రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. హుజురాబాద్‌లో మిని స్టేడియం నిర్మాణం కోసం కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగున ఆటంకాలు కల్పించడం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయని అన్నారు. గ్రామ పంచాయితీ ఎన్నికలైనందున కేంద్రం తాజాగా రూ.లు 250 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తాను చొరవ తీసుకోవడం వల్లే నిధులు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. బిజెపికి మున్సిపల్ చైర్మన్ పీఠం అప్పగించిన వెంటనే హుజురాబాద్ పట్టణంలో అర్థంతరంగా నిలిచిన మినీ ట్యాంక్ బండ్ పనులను పూర్తి చేయిస్తానని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు ఏమిచ్చారు...? గాడిద గుడ్డు తప్ప అని ఎద్దేవా చేశారు. మంచి పాలన కోసం బిజెపికి అవకాశం ఇవ్వాలని, మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి 50 వేలు విరాళం

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో గౌడ కులస్తులు నిర్మిస్తున్న ఎల్లమ్మ గుడి నిర్మాణానికి నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ (సింగరేణి ఉద్యోగి) రూ.50 వేల రూపాయల విరాళాన్ని గురువారం గౌడ సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలందరి ఆరాధ్య దైవం ఎల్లమ్మ గుడి నిర్మాణం కోసం తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఎల్లమ్మ గుడి నిర్మాణంలో తన వంతుగా సహాయం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఆలయ కమీటి సభ్యులు,గౌడ కులస్తులు శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు,కులస్తులు అధిక సంఖ్యలోఉన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు ఐబిఎం స్కిల్ బిల్డ్ ఇన్ ఎఐ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి లోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఐబీఎం స్కిల్ బిల్డ్ ఇన్ ఏఐ జనరేటివ్ అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు.ఇందులో భాగంగా మెటం ఐటీ సొల్యూషన్స్ సంస్థ యొక్క రిసోర్స్ పర్సన్ విశాల్ మాట్లాడుతూ కళాశాలలో అత్యున్నతమైన సౌకర్యాలు కల్పించబడ్డాయని కొనియాడారు.ఇటువంటి సౌకర్యాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం వల్ల వారి భవిష్యత్తు చాలా అత్యున్నతంగా ఉంటుందని కొనియాడారు. ఇందులో భాగంగా కళాశాల చైర్మన్ ఏ.నవీన్ కుమార్,డైరెక్టర్ నవత,ప్రిన్సిపల్ డాక్టర్ టి శ్రీనివాస్,అకౌంట్స్ ఆఫీసర్ పి పవన్ కుమార్,ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కె. వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆడిచర్ల రమేష్, వంశీ రాజ్, రమ్యశ్రీ, శ్రావణి,తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మైదంబండ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన త్రాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ బియ్యాని శివకుమార్ అధ్యక్షతన జరగగా, ఇందులో మిషన్ భగీరథ ఏఈఈ కీర్తన వారి సిబ్బంది పాల్గొన్నారు.సమావేశం అనంతరం ఏఈఈ కీర్తన,సర్పంచ్ బియ్యని శివకుమార్ కలిసి గ్రామంలోని నీటి సరఫరాను పరిశీలించారు. గ్రామంలో ప్రధాన పైప్‌లైన్లకు ఉన్న లీకేజీలను గుర్తించి,యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛమైన నీరు అవసరమని,అందుకే ఓవర్ హెడ్ ట్యాంకులను శాస్త్రీయంగా శుభ్రం చేసి, తగిన మోతాదులో క్లోరినేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నల్లా కనెక్షన్లకు తప్పనిసరిగా ట్యాప్‌లు (బిళ్లలు) బిగించుకోవాలని, నీటిని వృథా చేయకుండా సహకరించాలని వారు గ్రామస్తులను కోరారు.

## ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లలో ఓటరుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైన ప్రస్తుతం ఎన్నికల విధులు నిర్వహించే వారు నగరపాలక సంస్థ కార్యాలయంలో 7,8,9 వ తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు.

కరీంనగర్ నగరపాలక సంస్థ 2 వ సాధారణ ఎన్నికల నిర్వహణ లో భాగంగా గురువారం రోజు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి నగరపాలక సంస్థ కార్యాలయంలో నూతన రెవెన్యూ భవనాన్ని కమీషనర్ అధికారులతో కలిసి సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కోసం పోలింగ్ కేంద్రంలో కౌంటర్లు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ కౌటర్లలో వసతి సౌకర్యాల పై అధికారులకు పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంకు సంబంధించి రెండు సెల్ఫీ నమూన కటౌట్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, కరీంనగర్ నగరపాలక సంస్థ 66 డివిజన్ల కు చెందిన ఎవరైన ప్రభుత్వ ఉద్యోగులు చేస్తూ, ప్రస్తుతం ఎన్నికల విధులు నిర్వర్తించే వారు మీ యొక్క ఆర్డర్ కాపీతో నగరపాలక సంస్థ లో పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం ఫాం 12 ద్వారా దరఖాస్తు చేస్తే, నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కౌంటర్లలో మీ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 7,8,9 తేదీల్లో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాలన్నారు.

ఎన్నికల డ్యూటీ ఆర్డర్ కాపితో నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫాం 12 ను పొందవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కోసం ప్రత్యేక కౌంటర్లతో పాటు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఎన్నికలకు అభ్యర్థులు సహకరించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరపాలక సంస్థ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోటీ అభ్యర్థులు సహకరించాలని ఎన్నికల అబ్జర్వర్ జితేందర్ రెడ్డి, ఎక్స్ పెండేచర్ అబ్జర్వర్ మనోహర్ అన్నారు. 2 వ సాధారణ పురపాలక సంఘం ఎన్నికల నిర్వహణ లో భాగంగా కరీంనగర్ రెవెన్యూ గార్డెన్ లో గురువారం రోజు పోటి చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఖర్చుల నిర్వహణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అబ్జర్వర్ జితేంధర్ రెడ్డి, ఎక్స్పెండేచర్ అబ్జర్వర్ మనోహర్ పాల్గొని 66 డివిజన్ల లో పోటి చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల నియమావళి ఖర్చుల నిర్వహణ పై సుదీర్ఘంగా వివరించి, దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల పారదర్శకత, నిష్పక్షపాతం, పరిమితులు, సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలో పోటి చేసే అభ్యర్థులు ప్రజాస్వామ్య బద్ధంగా మరిమితులకు లోబడి ప్రచార కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ఎన్నికల సంఘం నియమాలు, నిబంధనలను తప్పక పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించరాదని సూచించారు. లా అండ్ ఆర్డర్ కు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రచారం చేయాలన్నారు. ప్రచారం చివరి రోజు ప్రచార సమయం ముగిసిన తర్వాత ఎలాంటి ప్రచారాలు చేయరాదని, బంధు, మిత్రులను కూడ కలవరాదని అది కూడ మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కిందకే వస్తుందన్నారు. మేయర్ అభ్యర్థి ఎన్నిక పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు.

## ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రచారం షురూ




**ప్రజాపక్షం/కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని కరీంనగర్ నగరంలో ప్రారంభించింది. పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి.. జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ తో కలసి 13వ డివిజన్ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పెంట స్వరూప సత్యం, 27 వ డివిజన్ శ్యామల కిరణ్ లతో పాటు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సింహం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా జోజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ఆశించిన ఫలితాలను ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. పేదలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలకు మేలు చేయాల్సిన పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. అలాగే గత బీఆర్ఎస్ పాలనలో కరీంనగర్ స్మార్ట్ సిటీ పేరిట ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థి పెంట స్వరూప సత్యాన్ని గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. 13వ, 27వ డివిజన్ అభివృద్ధికి ఫార్వర్డ్ బ్లాక్ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తుందని తెలిపారు.కరీంనగర్ నగరంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి రోజురోజుకీ ప్రజల మద్దతు పెరుగుతోందని, ఈ ఎన్నికల్లో అధిక స్థానాలను కైవసం చేసుకునే దిశగా పార్టీ బలంగా అడుగులు వేస్తోందని జోజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల విజయ్ కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

**ప్రజాపక్షం/రామడుగు:** చొప్పదండి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుమాల రేవంత్ రెడ్డి గుమ్లాపూర్ గ్రామంలో నేడు జరిగిన బహిరంగ సభ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మండల పోలీసులు బిఆర్ఎస్ నేతలను గురువారం ఉదయమే ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి పర్యటనలు ఎక్కడ జరిగిన తమను ముందస్తు అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడం ఒకటేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు సరైన సమయంలో నెరవేరిస్తే అక్రమ అరెస్టులు అవసరం ఉండదన్నారు. ప్రజాపాలన అని చెప్పుకుంటు ప్రతిపక్ష నాయకుల గొంతులు నొక్కడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు గంట్ల వెంకటరెడ్డి, మామిడి తిరుపతి, సర్పంచ్ గుడ్ల శేఖర్, మాజీ సర్పంచులు గుండి ప్రవీణ్, సైన్ల కరుణాకర్, జూపాక మునీందర్, శేఖర్, జుట్టు లచ్చయ్య, ములుగూరి మల్లేశం, ఉప సర్పంచ్ చిరుత అంజయ్య తదితరులు ఉన్నారు.

## ఒయుదే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీ

**ప్రజాపక్షం/కరీంనగర్:** సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఉస్మానియా యూనివర్సిటీ మెన్స్ క్రికెట్ టీమ్ సత్తా చాటింది. మైసూర్ వేదికగా జరిగిన ఫైనల్స్‌లో 10 పరుగుల తేడాతో విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఓయూ టీమ్ 25 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 214 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ టీమ్ 24.3 ఓవర్లలో 204 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఈ గెలుపుతో నేషనల్ లెవల్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది ఉస్మానియా యూనివర్సిటీ, రాజ్‌కోట్ వేదికగా జరిగే మ్యాచ్‌లోనూ సత్తా చాటితే నేషనల్ ఛాంపియన్‌గా నిలవనుంది ఓయూ టీమ్. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తా చాటాడు కరీంనగర్ కు చెందిన ధర్మపురి సాత్విక్, ఓయూ టీమ్ గెలుపులో కీ రోల్ ప్లే చేశాడు. మొత్తం 8 ఇన్నింగ్స్‌లు ఆడిన సాత్విక్ 17 వికెట్లు తీసి ప్రతి గెలుపులో తన వంతు పాత్ర పోషించాడు. ఈ టోర్నమెంట్‌లో ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఫైనల్స్‌లోనూ 4.3 ఓవర్లు వేసిన సాత్విక్ 40 పరుగులు ఇచ్చి మూడు కీలక వికెట్లు తీశాడు.

## విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

**ప్రజాపక్షం/అంతర్గాం :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న ఆహార విషయంలో నాణ్యత పాటించాలని, వారికి పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యంగా ఉండేలా చూడాలని అంతర్గాం మండలం మూర్మూర్ గ్రామ సర్పంచి మగ్గిడి స్వరూపశ్రీనివాస్ అన్నారు. గురువారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాల, తరగతులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వంటి రికార్డులను పరిశీలించారు. విద్యతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమనే విషయాన్ని విద్యార్థులకు నేర్పించాలన్నారు. పాఠశాలకు విద్యార్థులు సక్రమంగా హాజరు అయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులతో కలిసి ఆమె మధ్యాహ్న భోజనం చేశారు. సర్పంచి వెంట ఉప సర్పంచి యాదండ్ల సుమన్ యాదవ్, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు బాల శివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లక్ష్మి సంకల్ప అకాడమీ ఉచిత గురుకుల ప్రవేశ పరీక్ష నమూనా

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల లో లక్ష్మి సంకల్ప అకాడమీ వారి ఉచిత గురుకుల ప్రవేశ నమూనా పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని అకాడమీ చైర్ పర్సన్ కె స్నేహ వినయ్ కుమార్, డైరెక్టర్ రాజ్ కుమార్ గడ్డం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం నిర్వహించే గురుకుల పరీక్ష విధానం, ప్రశ్నల సరళి,విద్యార్థులకు అవగాహన చేయడమే లక్ష్యంగా ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష ఫిబ్రవరి 8న సిరిసిల్లలోని సెలెస్టియల్ పాఠశాలలో నిర్వహించబడుతుందని తెలిపారు. విద్యార్థులు ముందుగా పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 93460 95300ను సంప్రదించాలని కోరారు.

# జగిత్యాల ఎమ్మెల్యే తక్షణమే రాజీనామా చేయాలి

ప్రజాపక్షం/జగిత్యాల : బిఆర్ఎస్‌లో ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నా అని పేర్కొంటున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణ డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రమణ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్వార్థపూరిత రాజకీయాలతో జగిత్యాల కలుషితం అయ్యిందని సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. 2014 ఎన్నికల్లో సంజయ్ కుమార్ ఓడిపోయినప్పటికి అప్పటి సిఎం కెసిఆర్ సంజయ్‌ని ఎంతో ప్రోత్సహించారని గుర్తు చేశారు. ఫిరాయింపుపై స్పీకర్ ఇచ్చిన తీర్పును గౌరవిస్తూనే మరోవైపు అనర్హతపై సుప్రీం కోర్టుకు వెళుతామన్నారు. రాహుల్ గాంధీ సిద్ధాంతాలను సైతం విస్మరిస్తున్న కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. అభివృద్ధి కోసం బీఆర్ఎస్ వీడిన అని చెబుతున్న సంజయ్ కుమార్ దొంగ మాటలు, కపట నాటకాలు ఆడుతున్నారన్నారు. మోసం చేసిన నాయకులను ప్రజలు నమ్మరని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తు, చిత్తుగా ఓడిస్తామన్నారు. జీవన్ రెడ్డిని అవమానించడం కాంగ్రెస్ విధానం సరైంది కాదని ఇప్పటికైనా అధిష్టానం జగిత్యాల సమస్యపై దృష్టి పెట్టాలన్నారు. 2029 ఎన్నికలకు బిఆర్ఎస్ ఇప్పని నుంచే ప్రణాళికలు ప్రారంభించామని కేసీఆర్ నేతృత్వంలో అదికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దావ సురేష్, ఐల్నేని సాగర్ రావు, ఐల్నేని వెంకటేశ్వర్ రావు, వొళ్లెం మల్లేశం, పడిగెల గంగారెడ్డి, వొల్లాల గంగాధర్, కార్తికేయ, వనమాల నిరంజన్, దయాల మల్లారెడ్డి ఉన్నారు.



## ఎన్నికల్లో పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలి



ప్రజాపక్షం/మల్లాపూర్ : మున్సిపల్ ఎన్నికల వేల ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం మెట్పల్లి పట్టణ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా సందర్శించి వాహన తనిఖీలను పరిశీలించారు. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు సిబ్బందికి సూచనలు అందించారు.ఎన్నికల ప్రవర్తన నియమాల్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని అక్రమ మద్యం నగదు ప్రలోభాలకు గురిచేసి వాటిపై ప్రత్యేకంగా దృష్టి కొనసాగించాలని సూచించారు. సరైన ఆధారాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదు తరలిస్తే సీజ్ చేయాలని అత్యవసర పరిస్థితుల్లో నగదు తీసుకెళ్లాల్చి వస్తే తగిన బిల్లులు సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజలు శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ కు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఎస్పి వెంట డిఎస్పి రాములు ,మెట్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ,ఎస్సై కిరణ్ ,సిబ్బంది ఉన్నారు.

## మహిళ సమాఖ్య భవనానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/మల్లాపూర్ : మండలంలోని కుస్తాపూర్ గ్రామంలో మహిళా సమాఖ్య భవనానికి నిధులు మంజూరు కాగా గ్రామ సర్పంచ్ జెల్ల రాజు గురువారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామంలో నూతన భవన నిర్మాణం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని వెనువెంటనే పూర్తిచేసి గ్రామ మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరికేల మహిపాల్, పంచాయతీ కార్యదర్శి మురళి, ఐకెపి సిసి, విఒఎలు, గ్రామ మహిళలు తదితరులు ఉన్నారు.

# శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

ప్రజాపక్షం/రాయికల్ : మండలంలోని కొత్తపేట శ్రీ రాజరాజేశ్వర నాగాలయంలో నిర్వహించే శివరాత్రి జాతర ఉత్సవాలపై ఆలయ కమిటీ నిర్వాహకులు మండల అధికారులతో గురువారం ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్ నాగార్జున మరియు ఎస్సై సుధీర్ రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యంగా తాగునీరు, టాయిలెట్లు, మెడికల్ కిట్లు, బస్సు రవాణా సౌకర్యాలు మరియు అంబులెన్స్ సౌకర్యాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఎస్సై సుదీర్ రావు మాట్లాడుతూ ఉత్సవాలను నిర్ణీత సమయానికే నిర్వహించేలా ఆలయ కమిటీ చర్యలు తీసుకోవాలని అన్నారు. జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు



ఏర్పాటు చేస్తామని అన్నారు. కొత్తపేట సర్పంచ్ మీనుగు అంజయ్య మాట్లాడుతూ జాతర ఉత్సవాలకు అధికారులతో పాటు గ్రామ ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు. రాత్రిపూట నడిచే కొత్తపేట జగిత్యాల బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆర్‌టిసి అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ సుష్మ, ఆలయ ఈవో విక్రమ్, వైద్యధికారి సతీష్,ఆర్టీసీ అధికారి రవీందర్,ఆలయ కమిటీ చైర్మెన్ దానవేని రాము, డైరెక్టర్లు వెంకట్, సత్తన్న, సత్యనారాయణ, ముత్యం, కొత్తపేట సర్పంచ్ రాజగంగు అంజయ్య, ఒడ్డెర కాలనీ సర్పంచ్ చంద్రశేఖర్ లతో పాటు నాయకులు పాల్గొన్నారు.

## మొగిలిపేటలో బాధిత కుటుంబాలకు సర్పంచుల ఫోరం పరామర్శ

ప్రజాపక్షం/మల్లాపూర్ : వ్యవసాయ పనికి కూలీలుగా వెళ్లి ట్రాక్టర్ బోల్తా పడి మరణించిన బాధిత కుటుంబాల సభ్యులను మల్లాపూర్ మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో గురువారం పరామర్శించారు. ఒకే ప్రమాదంలో నాలుగు కుటుంబాలకు చెందిన మహిళ కూలీలు మరణించడం చాలా బాధాకరమని, పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి ఓదార్చారు. అదేవిధంగా వివిధ కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను సైతం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు రోండ్ల రాజేశ్వరి రాజారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు గోల్కొండ కళా రమేష్,ఏగ్యారపు లింబాద్రి, ఏలేటి వెంకట్ రెడ్డి, తేలు నరేష్, పోతవేణి నారాయణ గౌడ్,, డప్పుల పద్మా నరసయ్య, పాతకాల మానస కిరణ్, గ్రామ ఉపసర్పంచ్ దండవేణి రాజేందర్, కాంగ్రెస్ నాయకులు సురేష్, పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాపక్షం/మల్యాల : జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని భక్త మార్కండేయ దేవాలయ ఆవరణలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పద్మశాలీ యువజన సంఘ నాయకులు తెలిపారు. రేకుర్తి కంటి ఆస్పత్రి, జగిత్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి బారి స్పందన లభించింది. ఈ శిబిరం లో వివిధ రకాల కంటి సమస్యలు ఉన్నవారు భారీగా తరలివచ్చారు. సుమారుగా 150కి పైగా రోగులు కంటి పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు.ఫోటో రాయికల్ 03

# అవగాహన లేకపోవడంతోనే జీర్ణకోశ సమస్యలు




ప్రజాపక్షం/జగిత్యాల : అవగాహన లేకపోవడవతోనే మానవులకు జీర్ణకోశ సమస్యలు అధికమవుతున్నాయని సోమాజీగూడ యశోద ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ కిరణ్ పెద్ది పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం నిరుపేదలకు సోమాజీగూడ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని కిరణ్ పెద్ది ఆధ్వర్యంలో నిర్వహించారు. జీర్ణ కోశ సమస్యలపై అవగాహన కల్పించి మాట్లాడారు. జీర్ణ కోశ సమస్య ఉన్న రోగులకు సాధారణ కడుపు నొప్పితో మొదలై కాలేయం వరకు వెళుతుందన్నారు. ఇలాంటి సమస్య ఉన్న రోగులకు యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆధునాతన, సాంకేతిక, అనుభవజ్ఞులైన నిపుణుల ఆధ్వర్యంలో చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రోగులకు సమగ్ర జీర్ణకోశ సంరక్షణలో సరికొత్త ప్రమాణాలతో సేవలు అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి సీనియర్ మేనేజర్ సుధీర్ రెడ్డి, మేనేజర్ హరీష్ రెడ్డి తదితరులు ఉన్నారు

## ఉప సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గం



ప్రజాపక్షం/రాయికల్ : రాయికల్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మూగల సంజీవ చారి, ఉపాధ్యక్షులు గా భూక్య శంకర్, అల్లెపు గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా ఎండి చాంద్ పాషా కోశాదికారిగా మరుపాక నారాయణ, సలహాదారులుగా మాలోతు సూర్య, కాయితి సంజీవ్, ఆర్మూరి లక్ష్మీ నారాయణ, గుగ్లావత్ శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులుగా బోడ రాజ్ కుమార్, బానావత్ రవి, కొంపెల్లి ప్రియాంక,నర్సయ్య , మల్లయ్య లను ఎన్నుకున్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్ఒ



ప్రజాపక్షం/సారంగాపూర్ : జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. సుజాత గురువారం సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించారు. ఆసుపత్రిలో పేషంట్లకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీర్పూర్ లక్ష్మి నర్సింహ స్వామి ఆలయంలో జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను సందర్శించారు. వారి వెంట మెడికల్ ఆఫీసర్ డా. రాధా రెడ్డి, డిపివో రవీందర్, సిహెచ్ఒ ఖుద్దూస్, సూపర్‌వైజర్ కిషోర్, తారా, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల గొల్లపల్లి మండలంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు గొల్లపల్లి శాఖ మేనేజర్ సిహెచ్ అంజయ్య ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సౌజన్యంతో చిల్వాకోడూరర్ ,లక్ష్మి పూర్ గ్రామ పంచాయితీ ఆవరణలో కళాజాత బృందం చే గురువారం ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ నరేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఖాతాదారుడు ఎస్ బి ఐ ఇన్సూరెన్స్ పథకాన్ని కలిగి ఉండాలని ఖాతాదారుల చరవాణికి గుర్తుతెలియని వ్యక్తులు బ్యాంకు సిబ్బంది అని మాట్లాడుతూ మీయొక్క ఖాతా, ఏటీఎం వివరాలు అడిగినప్పుడు ఖాతాదారులు చెప్పకూడదని మేము నేరుగా బ్యాంకుకు వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడుతామని తెలియజేయాలని తెలిపారు.డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ,ఏటీఎం పిన్ నెంబర్ ఎవరికి చెప్పకూడదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మీ ఫోన్ కు మెసేజ్ పంపి యూపీఐ పిన్ నంబర్స్ వివరాలు అడుగుతారు ఖాతాదారుడు చాకచక్యంగా వ్యవహరించి బ్యాంకు సిబ్బందిని



సంప్రదించవలసిందిగా తెలిపారు. ముఖ్యం గా సామాజిక భద్రత పథకాల గురించి జీవనజ్యోతి భీమా యోజన పథకం అటల్ పెన్షన్ యోజన పథకం ,ఇన్సూరెన్స్, గోల్డ్ లోన్ ,డిజిటల్ సేవలు ,క్రాప్ లోన్ వివిధ పథకాలను ఖాతాదారులు వినియోగించుకోవాలని తెలిపారు.ఖాతాదారులకు ఫోన్ పే ,గూగుల్ పే గురించి కళాజాత బృందం ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు తిరుపతి గౌడ్ కాసం రాజశేఖర్,ఫీల్డ్ ఆఫీసర్ నరేష్,కార్యదర్శి జీవన్ ,వివో ఏలు ఖాజమియా, పూజిత ,ఖాతాదారులు మహిళా సంఘాల సభ్యులు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజాపక్షం/మల్లాపూర్ : మండలంలోని వాల్గొండా తండ గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులు సహాయ సహకారాలు అందించాలని గ్రామ సర్పంచ్ సురేందర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఉప సర్పంచ్ శ్రీనివాస్‌తో కలిసి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీకాంత్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి సమస్యలపై చర్చించగా అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈయన వెంట ఉప సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

# వార్డు అభివృద్ధికి కమలం గుర్తుకే ఓటేయండి

**ప్రజాపక్షం/వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 24వ వార్డు బీజేపీ అభ్యర్థి రావల్లి శ్రీధర్ గురువారం వార్డులోని పలు కాలనీల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డులోని మౌలిక వసతుల కల్పనే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. గత కౌన్సిలర్లుగా వార్డులో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారయ్యాయని, తాను గెలిచిన వెంటనే రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గతంలో లయన్స్ క్లబ్, వంటి సేవా సంస్థ ద్వారా ప్రజలకు చేరువయ్యానని, ఇప్పుడు వార్డు సేవకుడిగా మీ ఇంటి కొడుకులా పనిచేసే అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ, కమలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** పెండింగ్లో ఉన్న భూ భారతి దరఖాస్తులను త్వరగతిన పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ ) బి .ఎస్ లత రెవిన్యూ అధికారులను ఆదేశించారు.గురువారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.రెవెన్యూ సిబ్బందితో భూ భారతి పెండింగ్ దరఖాస్తులు , ఓటరు జాబితా సవరణ , ఇరిగేషన్ ట్యాంక్స్ సెన్సెక్స్ సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, సర్టిఫికెట్లు ప్రజలకు అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు.కార్యక్రమంలో అనంతరం బి ఎల్ ఓ ,గ్రామ పాలన అధికారులతో (జి పి ఓ ) ఏర్పాటుచేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బి.ఎల్.ఓల పాత్ర కీలకమని ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటరు నమోదు చేసి వివరాలు సరిచూడాలన్నారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు.అనర్హుల పేర్లను నిబంధనల మేరకు తొలగించాలని, వయస్సు, చిరునామా వంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఫోటోలు ,ఆధార పత్రాలను పరిశీలించాలని ఫారమ్ 6, 7, 8లను సక్రమంగా స్వీకరించాలని అన్నారు.స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో ,ఆన్లైన్ లో నమోదు చేయాలని సూచించారు .డూప్లికేట్ నమోదులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు.ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, మొబైల్ యాప్‌ల ద్వారా డేటా అప్‌లోడ్ చేయాలని, పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అందరు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పట్టణ, గ్రామ, వార్డు స్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువైనదని గుర్తు చేశారు. ఎన్నికల స్వచ్ఛతకు అందరూ సహకరించాలని కోరారు. బాధ్యతాయుతమైన పని విధానం అవసరమన్నారు. నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు. తదనంతరం గ్రామాల్లోని చెరువుల యొక్క గణాంకాలు నీటి పారుదల శాఖ తో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ఉండేలా చూడాలని జిపివోలను అదనపు కలెక్టర్ బిఎస్ లత ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అబ్దుల్ మాజిద్, డిప్యూటీ తాసిల్దార్ సుమన్ ,ఆర్ ఐ జీవన్ , రెవెన్యూ సిబ్బంది, జీపివోలు, బి ఎల్ వో లు,తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** క్యాన్సర్ నివారణ పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. గురువారం రోజున ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల జూనియర్ కళాశాల, పెద్దపల్లి నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రధాన జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ప్రమోద్ కుమార్ హాజరై మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ సూచించిన క్యాన్సర్ నివారణ చర్యలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని, వాటిని ఆచరించి తమ కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సానిటరీ నాప్కిన్లను అందించాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. బాలికలు మరియు మహిళలు ప్రతి నెల స్వయంగా బ్రెస్ట్ స్క్రీనింగ్



చేసుకోవాలని, ఏవైనా అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని తెలిపారు. ఎం ఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రిలో మొదటిసారి కీమోథెరపీ చేయించుకున్న రోగులకు తదుపరి కీమోథెరపీ చికిత్స అందించేందుకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రామగుండంలో 10 పడకలతో క్యాన్సర్ కేర్ ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయబడిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. కె. రాజమౌళి, వైద్య అధికారులు డా. లక్ష్మీ భవాని, డా. సంయుక్త, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు ఎన్. శ్రీనివాస్, ఎం. బాలకృష్ణ, కె. సంకీర్తన, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, మధుసూదన్, టి. రాజేష్, కె.రమేష్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలోచించి ఓటు వేయండి... అభివృద్ధి చేసి చూపిస్తాం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ఓటర్ మహాశయులు ఆలోచించి బిఆర్ఎస్ నాయకులకు ఓటు వేస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ నిత్యం సునీత అన్నారు. గురువారం పట్టణంలోని15వ వార్డు బిఆర్ ఎస్ పార్టీ,కౌన్సిలర్ అభ్యర్థి చొప్పరి అంజలి అరుణ్ కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారికి మద్దతుగా 15 వార్డులో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం మాజీ చైర్పర్సన్ ముత్యం సునీత మాట్లాడుతూ బాధలో ఉన్న ప్రచారం చేస్తున్నా ఒక్కసారి ఆలోచించి ఓటు వేయండి.ఈ మున్సిపల్ ఎన్నికల్లో 15వ వార్డు బి ఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిస్తే సుందరంగా అభివృద్ధి చెందుతున్నారు. కావున ప్రతి ఒక్క ఓటు కారు గుర్తుపై వేయాలని ముత్యం సునీత ఓటర్లను వేడుకున్నారు. తాను మున్సిపల్ చైర్ పర్సన్ గా ఉన్నప్పుడు 15వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, తిరిగి 15వ వార్డులో బి ఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి చొప్పరి అంజలి



అరుణ్ కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే తన భర్త స్వర్గీయ ముత్యం రమేష్ గౌడ్ ఆశయ సాధనలో భాగస్వామ్యం కావాలని కోరారు. 15వ వార్డు ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. 15వ వార్డులో సీసీ రోడ్లు డ్రైనేజీలు వీధి దీపాలు మంచినీటి సరఫరా వంటి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఐతరాజు పల్లి సర్పంచ్ భూమేష్ కుమార్, మొలుగురి అంజయ్య గౌడ్, రమణ, సాజిద్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండంలో అరాచక పాలన సాగుతుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో 23, 52, 53, 54, 55, 41, 35 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఇంచార్జి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని అయనఅన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ లో రాష్ట్ర ప్రజలను ఆశ పెట్టి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిందని అన్నారుప్రజలు ఆశపడి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని ప్రజలు ఆశపడడం తప్పు కాదు కాంగ్రెస్ పార్టీ మోసం చేయడం తప్పని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రజలకు చేసింది ఏమీ లేదని, రాష్ట్రంలో ఏవర్గం కూడా సంతోషంగా లేదని ఆయన అన్నారు.ఈ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేస్తే వారి పరిపాలన బాగుందని, ఒప్పుకున్నట్లే అని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే ఇదే మంచి



సమయమని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో నడుస్తున్న రౌడీల దుర్మారుల పాలన మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలంతా చరమగీతం పాడాలని బీ.ఆర్.ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థు ల కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మూల విజయ రెడ్డి ,కౌశిక ,హరి, నడిపెల్లి మురళీధర్ రావు ,నారాయణ,దాసు, మారుతి, అచ్చే వేణు, బీ.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థులు సిలివెర రవి ,నీరటి శ్రీనివాస్, ఇనుముల సత్యం ,సత్యవతి ,చంద్రమౌళి, గుండా కిషన్ , నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

**ప్రజా పక్షం/సుల్తానాబాద్ :** చేవెళ్ల ఘటనకు నిరసనగా సుల్తానాబాద్ న్యాయవాదులు విధులను బహిష్కరించారు.చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యురాలు యువ మహిళా న్యాయవాది స్వప్న ను దుండగులు అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి అన్నారు.ఈ దారుణ హత్యకు నిరసనగా గురువారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు హేయమైన చర్య అని, వారి రక్షణ కోసం ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొయిని భూమయ్య ,న్యాయవాదులు భూసారపు బాల కిషన్ ప్రసాద్, మాదూరి ఆంజనేయులు,పడాల శ్రీరాములు,ఆకారపు సరోత్తం రెడ్డి,జోగుల రమేష్,చిలుక ఆనంద్,వంగల యుగేందర్ రెడ్డి, వేముల స్నేహ,పాల్గొన్నారు.

## నిబంధనలను మరిచి అభిషేకాలు చేసి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలవుతున్న సందర్భంగా ఎలక్షన్ అధికారులు ఆయా ప్రాంతంలో ఉన్న ప్రముఖుల విగ్రహాలకు ముసుగులు వేశారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కొందరు నాయకులు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు రెండో వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజమల్లు విగ్రహానికి ఉన్న ముసుగు తొలగించి మరి విగ్రహానికి పాలాభిషేకం చేసి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికలవేళ మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న విగ్రహానికి నిబంధనలను మరిచి సైతం పాలాభిషేకం చేయడంతో అసలు పట్టణంలో ఎలక్షన్ నిబంధనలు అమలు అవుతున్నాయా అని సాధారణ ప్రజలు అనుమానాన్ని వ్యక్తపరిచారు.

## ముఖ్యమంత్రి వాఖ్యలపై భగ్గుమన్న వెల్మ సంఘం

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణంలోని వెల్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రెస్ క్లబ్ జే ఏ సీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వెల్మ సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అన్ని కులాల, సామాజిక వర్గాల,ప్రజలను సమానంగా చూస్తానని ప్రమాణం చేసి ముఖ్యమంత్రి కాగా రాజ్యాంగబద్ధంగా ఆయన చేసిన ప్రమాణాన్ని తరుచుగా విస్మరిస్తూ వెల్మ కులం మీద విరుచుక పడుతూ వెల్మలపై కాక్ష సాధింపు కు దిగుతున్నారని అన్నారు.వ్యక్తులతో రాజకీయ వైరుధ్యాలు ఉంటే అట్టి వ్యక్తులతో చూసుకోవాలి కానీ పదేపదే వెలమ కులాన్ని దూషిస్తూవ్యాఖ్యలు చేయడం వలన మా మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుగ్యాల రాజేశ్వర్ రావు, యాచమనేని శ్రీనివాసరావు, సంతోష్ రావు, జకిలేటి హరీష్ రావు, జకిలేటి రాజశేఖర్ రావు, ప్రశాంత్ రావు, కిరణ్ రావు, లక్ష్మణ్ రావు, దాసరపు వేణు రావు, కరుణాకర్ రావు, దుగ్యాల రమాపతి రావు, దుగ్యాల శ్రీనివాస్ రావు, సాగర్ రావు,రత్నాకర్ రావు, మండల వెలమ సభ్యులు పాల్గొన్నారు.

## మామిడి తోటల పరిశీలన

**ప్రజాపక్షం/రాయికల్ :** జగిత్యాల నియోజకవర్గం ఉద్యాన అధికారి కందుకూరి స్వాతి గురువారం రాయికల్ మండలంలోని పలు గ్రామాల్లోని మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం చేపట్టే సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు.ప్రస్తుతం మామిడి తోటలు పిందె కట్టే దశలో ఉన్నాయని ఈ సమయంలో నీటి ఎద్దడికి గురిచేయకుండా సక్రమంగా నీటి తడులు అందించాలన్నారు.లేనిచో కట్టిన పిందె రాలిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు.అదేవిధంగా తేనెమంచు పురుగు, తామర పురుగు వంటి రసం పీల్చు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న తోటల్లో ఇమిడాక్లోప్రిడ్ 4ml లేదా తయోమెథక్సిమ్ 4గ్రాములు,వేపనూనె (10000ppm ) 20 ml 10 లీటర్ల నీటికి కల్పి స్ప్రే చేయాలన్నారు.బూడిద తెగులు ఆశించిన తోటలకు హెగ్జాకోనాజోల్ 20 ml 10 లీటర్ల నీటికి కల్పి స్ప్రే చేయాలన్నారు.బఠాణి సైజు దశలో పిందె రాలడాన్ని నివారించుటకు ప్లానోఫిక్స్ అనే హార్మోనును 2.5ml 10 లీటర్ల నీటికి కల్పి స్ప్రే చేయాలని సూచించారు. పిందెలు నిమ్మకాయ సైజు దశలో ఉన్నప్పుడు కాయ సైజు త్వరగా పెరగడానికి 13045 100 గ్రాములు 10 లీటర్ల నీటికి కల్పి స్ప్రే చేయాలన్నారు.ఈ కార్యక్రమం లో ఉద్యాన విస్తరణ అధికారి రాజేష్ మరియు రైతులు పాల్గొన్నారు.

## బిజెపి మంచిర్యాల మేయర్ అభ్యర్థిగా ముఖేష్ గౌడ్



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి మేయర్ అభ్యర్థిగా మాజీ వైస్ ఛైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు పాత్రికేయుల సమావేశంలో బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌లు ముఖేష్‌గౌడ్‌ను మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాని మోడి తీసుకుంటున్న సాహోసేపేత నిర్ణయాలు, దేశ భవిష్యత్ కోసం చేస్తున్న సంక్షేమ ఫలితాలు రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రభావితం చూపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచిర్యాల కార్పొరేషన్ అభివృద్ధి చెందాలంటే ఈ సారి ప్రజలు బిజెపిని ఆదరించి మెజార్టీ కార్పొరేటర్లను గెలిపించి మేయర్ స్థానం కైవసం చేసుకునేలా ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు . బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం / కెరమెరి :** కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాధితురాలికి పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బొమ్మేన శిరీష కొంతకాలంగా కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో ఆసుపత్రి ఖర్చులకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సేవా సమితి సభ్యులు స్పందించారు. దాతల సహకారంతో సేకరించిన రూ. 25,053 నగదును బాధితురాలి నివాసానికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు, పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి వ్యవస్థాపకులు పెందోర్ శ్రీనివాస్, సభ్యులు పెందోర్ వినేష్, దిందార్ షా, సెద్మకి తుకారాం, వికార్ దేశ్ముక్, షేక్ ఫారిద్, కంబాల వినేష్, కూటికేల వెంకటస్వామి, కేంద్రే చంద్రకాంత్, షేక్ మున్ను, ఎర్ర పోశం, గుర్నులే కృష్ణ పాల్గొన్నారు.

## అంగన్వాడీ.. పౌష్టికాహారంతో ఆరోగ్యం

**ప్రజాపక్షం / జన్నారం :** అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా తీసుకోవాలని తిమ్మాపూర్ సర్పంచ్ గుగ్లావత్ సంగీత రవి నాయక్, కార్యదర్శి మేక లావణ్య సూచించారు. గురువారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం1లో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నుంచి ఐదేళ్ల లోపు పిల్లలను ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో తోడ్పడుతుందని తెలిపారు.

# 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఈనెల 12వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరు చిరంజీవి పిలుపునిచ్చారు. గురువారం సివిల్ సప్లై జిల్లా మేనేజర్ నర్సింహారెడ్డికి ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. గత నవంబర్ 21న విడుదల చేసిన నోటిఫికేషన్స్ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకుని, పాత 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమ్మెలో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సివిల్ సప్లై హమాలీ కార్మికులు, ఇతర సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్టుపల్లి సుధాకర్, నాయకులు తులసిరాం, సురేష్, దివాకర్, మోహన్ పాల్గొన్నారు.

# మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కేంద్ర కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. గురువారం కుమరం భీం జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేందర్, టియుసిఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, ఐఎఫ్టియు నాయకులు తిరుపతి మాట్లాడారు. కేంద్రం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని వారు మండిపడ్డారు. నవంబర్ 21న విడుదల చేసిన నోటిఫికేషన్లను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి, ఆర్‌టిసి, సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులతో పాటు స్కీం వర్కర్లు, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, ఎన్‌హెచ్‌ఎం రంగాల కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనాలని కోరారు. స్కీం వర్కర్లను రెగ్యులర్ చేస్తూ నెలకు 26,000 రూపాయల కనీస వేతనం అందించాలని, సీనియారిటీ ప్రకారం ఆశా వర్కర్లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం బానిస సంకెళ్లు తెంచుకుని పోరాడాలని పిలుపునిచ్చారు.

## మున్సిపల్ పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు తమకు అప్పగించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఆలోక్ కుమార్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారి భార్గవ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరుగుతాయని, పోలింగ్ ప్రక్రియలో వినియోగించే ప్రతి పత్రంపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పిఓ డైరీలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలని, ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని జోనల్ అధికారులకు అందించాలని ఆదేశించారు. బ్యాలెట్ పత్రాలను, పోలింగ్ సామాగ్రిని ముందుగానే సరిచూసుకోవాలని తెలిపారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేలా సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి, ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైనర్లు, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

# పన్నుల వసూలులో వేగం పెంచాలి

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం / దండేపల్లి :** గ్రామ పంచాయతీల పన్నుల వసూలు ప్రక్రియలో ఎటువంటి జాప్యం చేయవద్దని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు కొర్విచెల్మ గ్రామంలోని నర్సరీని సందర్శించి, రికార్డులు, పారిశుధ్య పనులను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూలులో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, సెగ్రిగేషన్ షెడ్లలో ఎరువుల తయారీ, నారుమళ్ల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీల హాజరు శాతాన్ని పెంచాలని, రాబోయే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులలో వేగవంతమైన పురోగతి ఉండాలని పేర్కొన్నారు. ఎంపిడిఒ జాగర్లమూడి ప్రసాద్, ఎంపిఒ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## పాఠశాలను తనిఖీ చేసిన డిఇఒ



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ మండల ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 1వ తరగతిలోకి వెళ్లి విద్యార్థులను డిక్ హెన్ స్పెల్లింగ్‌ను విద్యార్థులకు రాయమనగా విద్యార్థులు రాయడంతో ఆయన సంతృప్తి వ్యక్త పరిచారు. అనంతరం 4వ తరగతిలో, 3వ తరగతిలో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాలను, యాక్షన్ ప్లాన్‌ను పరిశీలించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ మార్క్స్ లిస్టు 1 2 పేపర్లను ఆయన పరిశీలించారు. విద్యాబోధన పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. వారి వెంట మండల విద్యాశాఖ అధికారి తిరుపతిరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాల్‌సింగ్, పాఠశాల సిబ్బంది, సీఆర్‌పీ వరలక్ష్మీ తదితరులు ఉన్నారు.

## నవోదయా విద్యాలయాన్ని సందర్శించిన డిఇఒ

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలకేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయాన్ని గురువారం జిల్లా విద్యాధికారి ఎస్.రాజు సందర్శించారు. ఈ నెల 7న జరిగే 9, 11 తరగతుల లాటరల్ ఎంట్రీ, ఎంట్రెన్స్ పరీక్ష కేంద్రాలకు నియమించబడిన చీఫ్ సూపరిండెంట్లకు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో కామారెడ్డి జిల్లాకేంద్రంలో 10 సెంటర్లు, నిజాంసాగర్‌లో 1 సెంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ రాంబాబు, నిజాంసాగర్ ఎంఈఓ వై.తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహబరితంగా ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార కార్యక్రమం ఉత్సాహబరితంగా సాగింది. ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు, బిచ్కుంద మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు విస్తృతంగా పాల్గొనగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ హాజరై రానున్న మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు.స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నేడు శుక్రవారం ఉదయం 12 గం.లకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ గురువారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్‌లు చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు.

## గంగాపూర్ వెంకన్న హుండీ ఆదాయం 19.30 లక్షలు

**ప్రజాపక్షం / రెబ్బెన :** రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. జాతరకు సంబంధించి భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి బల్లు రమేష్ పర్యవేక్షణలో లెక్కించగా 19,30,319 రూపాయల నగదు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. నగదుతో పాటు ఒక యూఎస్ఏ డాలర్ కూడా హుండీలో లభించిందని తెలిపారు. రెబ్బెన సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజయ్, ఎస్ఐ వెంకటకృష్ణల పర్యవేక్షణలో పోలీసులు తగు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ పునరుద్ధరణ కమిటీ ఛైర్మన్, సభ్యులు, వివిధ దేవాలయాల సిబ్బంది, గంగాపూర్, రెబ్బెన గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మాంసపు వ్యర్థాలను రోడ్లపై వేయరాదు

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి,ఆధ్వర్యంలో గురువారం గ్రామపంచాయతీలో చికెన్,మటన్,సెంటర్ యజమానులతో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చికెన్ మాంసము వ్యర్థాలను రోడ్డుపై వెయ్యకుండా నివారించవలెనని అదేవిధంగా వీధి కుక్కలకు మాంసం వ్యర్థాలను వెయ్యరాదని,గ్రామపంచాయతీ సూచించిన డంపుయాడలలో మాత్రమే వేయాలని సదా గ్రామ పంచాయతీ పరిశుభ్రతకై ప్రతి ఒక్కరు సహకరించాలని పరిశుభ్రతకై ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు.ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ఐ.నర్సారెడ్డి,చికెన్ మటన్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

## ప్రహారీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని కిష్టాపూర్ గ్రామ పంచాయతీ లోని శంకరాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రహారీ గోడ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ జితేందర్ సింగ్,తో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు అందించే దిశగా ప్ర భుత్వం కృషి చేస్తోందన్నారు.గ్రామీణ ప్రాంతా పాఠశాలలు మరింత అభివృద్ధి చెం దేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.గంగాధర్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్,నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతా రెడ్డి,సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

### గిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇళ్లు అందించిన ఘనత ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ స్పష్టం చేశారు. నిర్మల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా,ఆయన 40వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి అడప విజయలక్ష్మి పోశెట్టి తరుపున చింతకుంట వాడలో విస్తృత ప్రచారం నిర్వహించారు.ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన,కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక నిరుపేదలు అనేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు.అయితే 2023 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని గుర్తుచేశారు.వీటితో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఇప్పటికే విజయవంతంగా అమలు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ నాయకులు అడప పోశెట్టి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ హర్షద్ అస్లాం,బీసీ సెల్ నాయకులు సతీష్ వర్మ,సేవాదళ్ ప్రతినిధులు వనిత,సరస్వతి,గిరిధర్,సంతోష్ పాల్గొన్నారు.

## వ్యక్తి మృతి కేసులో నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష

### ఎస్పి నితిక పంత్



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చి ఓ వ్యక్తి మృతికి కారణమైన నలుగురు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు తీర్పునిచ్చిందని జిల్లా ఎస్పి నితిక పంత్ గురువారం వెల్లడించారు. ఎస్పి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్1 గ్రామానికి చెందిన శ్రీరామ్ మండల్, రూప్‌కుమార్ మండల్, రామ్ మండల్, కీనా మండల్ 2018 సెప్టెంబర్ 15న వన్యప్రాణుల వేట కోసం పొలంలో అక్రమంగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన సుకుముర్ రాయ్ ఆ తీగలను తాకి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడి భార్య శీలరాయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. రమేష్ నిందితులను దోషులుగా తేల్చుతూ శిక్ష ఖరారు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన శిక్షలు తప్పవని ఎస్పి నితిక పంత్ హెచ్చరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్ రావు, డిఎస్పి వాహీదుద్దీన్, సిఐ సంతోష్ కుమార్, ఎస్ఐలు నరేష్, సందీప్ కుమార్, సిబ్బందిని ఎస్పి అభినందించారు.

## సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవు

### కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ సమయపాలన పాటించని అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆబ్కారీ మద్య నిషేధ, పౌరసరఫరాలు, వ్యవసాయ, భూగర్భ జల, మత్స్య, వైద్య ఆరోగ్య, విద్య, భూ కొలతల శాఖల కార్యాలయాల్లో హాజరు పట్టికలను స్వయంగా పరిశీలించారు. గైర్హాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకోగా, కొందరు డిప్యూటేషన్ పై ఉన్నట్లు అధికారులు వివరించారు. విధులకు హాజరైన వారు సైతం రిజిస్టర్ లో సంతకాలు చేయకపోవడాన్ని కలెక్టర్ గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందాలంటే సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి భార్గవ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అరుణాచల నృత్యోత్సవంలో నాటరాజ కళాక్షేత్రం విద్యార్థులు



**ప్రజాపక్షం / జన్నారం :** అరుణాచల నృత్యోత్సవంలో జన్నారం, లక్సెట్టిపేట ప్రాంతాలకు చెందిన నాటరాజ కళాక్షేత్రం విద్యార్థులు అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అరుణాచలంలోని లంబోదర అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 31న నిర్వహించిన ఉత్సవంలో విద్యార్థులు తమ నృత్య ప్రతిభను చాటారు. గురువు గాజుల నర్మదా మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులు సాంప్రదాయ శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల నైపుణ్యం, భావప్రకటన, లయాత్మక ప్రదర్శనలు నృత్యోత్సవానికి మరింత శోభను చేకూర్చాయి. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. నాటరాజ కళాక్షేత్రం అందిస్తున్న సేవలను, గురువు నర్మదా శిక్షణను తల్లిదండ్రులు, కళాప్రియులు కొనియాడారు. భవిష్యత్తులో విద్యార్థులు కళారంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రునికి పరామర్శ

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్..



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ ముందర బెల్ తరోడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎస్.ఎస్.కాటణ్ ఫ్యాక్టరీ సమీపంలో కారు బైక్‌ను ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.విషయం తెలుసుకున్న వెంటనే ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారవు పటేల్ తమ కార్యాలయం నుండి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు.అక్కడ పరిస్థితిని పరిశీలించి,దగ్గరలో ఉన్న అంబులెన్స్ ద్వారా గాయపడిన వ్యక్తిని వెంటనే ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.బాధితుడికి త్వరితగతిన వైద్యం అందేలా స్వయంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధితునికి ధైర్యం చెప్పి,అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## ఖానాపూర్ బస్టాండ్‌లో ప్రయాణికుల ఇక్కట్లు

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కొద్ది రోజుల క్రితం ప్రారంభించిన మరుగుదొడ్ల మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులు,పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మరమ్మత్తు పనులు పూర్తి అవకపోవడంతో సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు.మరమ్మత్తులు చేపట్టడం తో తాత్కాలిక మూత్ర శాల ఏర్పాటు చేసిన అది సరిగ్గా లేదని,వాటి పక్కనే పురుషులు మూత్ర విసర్జన చేస్తున్నారని,అటు వైపు మహిళలు ఎలా వెళ్తారని మండిపడ్తున్నారు.మరో వైపు ప్రయాణికులు కూర్చునే కుర్చీలు వంగిపోయి,కూర్చోవడానికి వీలు లేకుండా ఉన్నవి,వాటిలో కూర్చుంటే ఇక్కట్లు పడాల్సి వస్తోందని అంటున్నారు.ఆర్టీసీ అధికారులు స్పందించి మరుగుదొడ్ల మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేసి, మహిళా ప్రయాణికులు పెరిగిన దృష్ట్యా ప్రయాణికుల రద్దీకి అవసరమయ్యే నూతన కుర్చీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## భూసేకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురయ్యే భూముల సేకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో ఆర్‌డిఓ శ్రీనివాస్ రావుతో కలిసి భూసేకరణపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యారేజీ బ్యాక్ వాటర్ వల్ల కోటపల్లి మండల పరిధిలోని దేవులవాడ, అర్జునగుట్ట, రావులపల్లి, రాపనపల్లి గ్రామాల భూములు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో భూసేకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని, ఈ ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాఘవేంద్ర కళాశాల సీనియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండల కేంద్రంలోని శ్రీ రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలలో మంగళవారం సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. జూనియర్ విద్యార్థులు తమ సీనియర్లతో గడిపిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ వారికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన వివిధ క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మోటివేషనల్ స్పీకర్ దాసరి రంజిత్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులు లక్ష్యశుద్ధితో చదువుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కెరీర్‌పై దృష్టి సారించాలని సూచించారు. పై చదువుల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, డీన్ హేమలత షిండే, ప్రిన్సిపాల్ లక్ష్మణ్, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జన్నారం మండల విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల సంఘం ఎన్నిక

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండల విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా కవ్వాల్ విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బలుసు రాజన్న, ఉపాధ్యక్షుడిగా బాదంపెల్లికి చెందిన దూసంల విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, కోశాధికారిగా కిష్టాపూర్ విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కవిత ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు తహసీల్దార్ రామ్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల సమస్యలు, అవసరాలపై చర్చించారు. తహసీల్దార్ రామ్మోహన్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ, విధుల నిర్వహణలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భానుచందర్, గంగరాజు, కార్యాలయ సిబ్బంది, విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



# కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది 2వ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, జనరల్ అబ్జర్వర్ సిహెచ్. సత్యనారాయణరెడ్డిల సమక్షంలో గురువారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈఓ సాయన్న, డీఈఓ అశోక్ పాల్గొన్నారు.

# మహిళలకు ఉచితం పురుషులకు అధికం

**ప్రజాపక్షం/బోధన్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలలో ఒకే హామీ నెరవేర్చాలని మహిళా శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పెట్టి పురుషలకు ఆర్టీసీ బస్సు టికెట్లపై అధిక రేట్లు పెంచి దండుకుంటున్నారని బిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా మాజీ జడ్పీ ఛైర్మన్ దాదన్న గారి విఠల్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలపై ప్రజలు నిలదీయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్ నివాసంలో గురువారం ఆయేషా ట్రస్టు ఛైర్మన్ ఆయేషా ఫాతిమా ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదన్నారు. రైతు భరోసా, మహిళలకు స్కూటీలు, పింఛన్‌ల పెంపు వంటి పథకాలను అమలు చేస్తామని రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలు నెరవేర్చడం లేదని విమర్శించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అబద్ధపు హామీలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. బోధన్ పట్టణంలోని మున్సిపల్ పరిధిలో 38వార్డులలో బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ అధ్యక్షులు రవీంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# జాతీయ రహదారులకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా పరిధిలో జాతీయ రహదారులకు అవసరమైన మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం,కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,జాతీయ రహదారి సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జాతీయ రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయాలని అన్నారు.రహదాలు వెంబడి పటిష్టమైన లైటింగ్ ఉండాలని అన్నారు.అవసరమైన ప్రదేశాల్లో వివిధ రకాల సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.జీబ్రా క్రాసింగ్‌లు,ఇతర క్రాసింగ్ మార్క్‌లకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించడం అధికారుల బాధ్యత అని తెలిపారు.జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల పైన జరుగుతున్న మరమ్మత్తుల పనుల వివరాలను




అధికారులను అడిగి తెలుసుకున్నారు.అధికారులు చేపట్టే భద్రత చర్యల వల్ల రహదారుల వెంట ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,జాతీయ రహదారి సంస్థ ఇంజనీరింగ్ అధికారి సుభాష్ బాబు,అర్.అండ్ బి డిఈఈ భీమ్ సింగ్,మున్సిపల్,ఇంజనీరింగ్,రవాణా శాఖల అధికారులు,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఉన్నత చదువులతో పాటు నైతిక విలువలు పెంపొందించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి మాజీ సభ్యుడు,కళాశాల డైరెక్టర్ వి.సత్యనారాయణ గౌడ్,విద్యార్థులకు పిలుపునిచ్చారు.గురువారం బైంసా పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాల 16వ వార్షికోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దృఢ సంకల్పంతో,అంకితభావంతో,లక్ష్యం సాధించే దిశగా చదువు పైన దృష్టి కేంద్రీకరించి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు.ఇంటర్మీడియట్ ఉన్నత శిఖరాలకు ఎదగడానికి పునాది లాంటిదని ఈ మెట్టును అధిగమించి భవిష్యత్తుకు ఉన్నతమైన చదువుకు మార్గం సుగమం చేసుకోవాలని సూచించారు.పోటీ పరీక్షల్లో విజయకేతనం ఎగురవేయడానికి వార్తాపత్రికలు,జనరల్ నాలెడ్జ్,ఇంగ్లీష్ పై పట్టు సాధించాలని సూచించారు.తల్లిదండ్రులు ఫీజులు చెల్లించి ఉన్నత చదువులు చదవాలని మీకోసం ఎంతో కష్టపడుతున్నారని,మీరు ఉన్నత స్థితికి చేరుకోవాలని వారు కంటున్న కలలను నిజం చేయడానికి,వారి కష్టానికి ప్రతిఫలాన్ని మీరు వారికి బహుమతిగా అభివృద్ధిలోకి రావాలని అన్నారు.

దురల వాట్లకు దూరంగా ఉండాలని,దేశభక్తిని పెంపోందించుకొని,క్రమశిక్షణతో సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు.మీ ఉన్నత స్థితి మీకు,మీ కుటుంబానికి,సమాజానికి మేలుకొలుపు కావాలని ఉద్బోధించారు.ఈ నెల 25 నుంచి జరిగే వార్షిక పరీక్షల్లో కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేష్,మోటివేషన్ స్పీకర్ లక్ష్మణ్,ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు భూషణ్ పాండే,డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంజీవ్,పండరి,డాక్టర్ విజయనందు,కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను ఉపేక్షిస్తున్న బిజెపి..

### 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు..

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఈనెల 12న నిర్వహించే జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్టియు ఆధ్వర్యంలో గురువారం ఖానాపూర్ పట్టణం తాపీ మేస్త్రి సంఘ భవనంలో గోడ ప్రత్తులను విడుదల చేసిన నాయకులు,ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేష్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేయాలని విద్యుత్తు సవరణ చట్టం,2025 విబిజి రాంజీ చట్టం,విత్తన సవరణ బిల్లు,ఎల్ఐసిలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక,ప్రజా,రైతు,వ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకోవాలని కోరుతూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని,కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు,కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని,కార్మికులను నిరాయుధలను చే.సి




పెట్టుబడుదారులు,పారిశ్రామికవేత్తలు,కార్పొరేటర్లకు అనుగుణంగా లేబర్ చట్టాలలో మార్పులు తీసుకొచ్చారని అన్నారు.కార్మికులు పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడిలను తీసుకువస్తుందని అలా జరగకుండా వాటిని రద్దు చేసే వరకు ప్రతిఘటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న,ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు ఉపాలి,ఐఎఫ్టియు నాయకులు ఆడెపు గణేష్,తాపీ మేస్త్రి సంఘం మండల కార్యదర్శి చిలుకూరి ఇస్తారి,కోమటిపల్లి పోశెట్టి,సోరపాక రాజన్న,జావిండ్ తదితరులు పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తాం

### రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంపి ఆర్

**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల సందర్భంగా భారతీయ జనతా పార్టీ మద్దతుదారులకు ఓటు వేసి గెలిపించి బోధన్ పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి ఓటర్లను కోరారు. గురువారం బోధన్ పట్టణంలోని 28వ వార్డులో పుట్ట ప్రియాంక గౌతమ్ గౌడ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోడీ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ బలపర్చిన అభ్యర్థులకు ఓటు వేసి భారీ మేజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో భారతీయ జనతా పార్టీ నాయకులు గోపి కిషన్, శ్రీధర్, విజయ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నేరడిగొండ :** మండలంలోని ఏఐటీయూసీ జెండా గద్దె ముందర ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సమ్మె పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి గంగయ్య,మాట్లాడుతూ కార్మికులు ఎదురు కుంటున్న సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కార్మికులందరూ లక్షలాదిక తరలివచ్చి ఈ సమ్మె ను విజయవంతం చేసే బాద్యత ప్రతి ఒక్క కార్మికుని భుజాలపై వేసుకొని రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గంగాదరీ గంగయ్య,శ్రీనివాస్,మండల బాధ్యులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# మురికి నీటిపై ఐకేరెడ్డి ఫైర్.. అధికారులకు ఫోన్..!

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీరు కలుషితంగా వస్తుండటంపై మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.గురువారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో,పలువురు కాలనీవాసులు నల్లాల ద్వారా మురికి నీరు వస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన మాజీ మంత్రి,అక్కడికక్కడే మిషన్ భగీరథ డీఈతో మాట్లాడి పరిస్థితిని ఆరా తీశారు.అనంతరం స్టేట్ చీఫ్ కృపాకర్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి,పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను వివరించారు.''ఎన్నికల సమయంలో ఇలాంటి నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు రాదా..?అని అధికారులను ప్రశ్నించారు.యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి,ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని ఆదేశించారు.కాలనీవాసుల ముందే ఉన్నతాధికారలుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మాజీ గారి రాజేందర్,లింగారెడ్డి,బాపయ్య,తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీతకు సన్మానం

**ప్రజాపక్షం/బోథ్ :** సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సి.వి.రమణ యంగ్ జీనియస్ అవార్డు చిత్రాలయ పురస్కార్ బెస్ట్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ అవార్డు ను నాగభూషణం మెమోరియల్ స్కూల్ బోథ్ కరస్పాండెంట్ కొంబత్తుల కిషోర్ హైదరాబాద్ రవీంద్రభారతి లో ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ శివాజీ రాజ చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా నాగభూషణం మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ కిషోర్ కుమార్ రచన కు మిత్రులు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో బోథ్ సర్పంచ్ అన్నపూర్ణమహేందర్,నక్కలవాడ గ్రామ సర్పంచ్ నవీన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు మేరుగు భోజన్న,బారే నాగేందర్,బోజ్జ సాయన్న,రమేష్ రాథోడ్,రమేష్ మర్లపల్లి ఉపసర్పంచ్,బోథ్ వ్యాపారస్తులు దోర రమేష్,కట్కూరి గంగాధర్,బీరం చంద్రమోహన్,జూకుంట సదాశివ్,సామల లక్ష్మీనారాయణ,లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.రాజన్న..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని(టి.యు.సి.ఐ) ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో బుధవారం రోజున వాల్ పోస్టర్లు విడుదల చేయడం అయినది.ఈ సందర్భంగా టి.యు.సి.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.రాజన్న మాట్లాడుతూ గత 12 సంవత్సరాల నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు.అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగినాయని,కానీ కార్మికుల వేతనాలు పెరగలేదన్నారు.కార్మికులకు ఉద్యోగ,ఆరోగ్య భద్రత కరువైందన్నారు.మోడీ ప్రభుత్వం అవలంబించిన కార్పోరేట్ కంపెనీల అనుకూల,కార్మిక వ్యతిరేక విధానాలే ఇందుకు కారణమన్నారు.మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా,కనీస వేతనాల అమలు కోసం,కనీస పెన్షన్ 9వేల అమలు కోసం,కనీస పెన్షన్ 9వేల అమలు కోసం,కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా,పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు.ఈ సమ్మెలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టి.యు.సి.ఐ జిల్లా నాయకులు గంగామణి,కిషన్,పోశెట్టి,రాజేందర్,శ్రీనివాస్,ఎల్లయ్య,లక్ష్మి ,కమల త్రైసిన్ లక్ష్మణ్,తదితరులు పాల్గొని బీడీ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు.

## ఆరు గ్యారంటీలతో... ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్

### మాజీ మంత్రి హరీష్ రావు



**ప్రజాపక్షం / గజ్వేల్:** ఆరు గ్యారంటీలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను మభ్యపెట్టి నట్టేట ముంచినట్లు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2, 3, 4, 5, 6 వార్డుల్లో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి , నియోజకవర్గ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర బీఆర్ఎస్ కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ప్రాణాలు ఫణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ ను బూతులతో తిట్టడం సీఎం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కగా, రాష్ట్రాన్ని దివాలా తీయించినట్లు స్పష్టం చేశారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగా, మళ్లీ కెసిఆర్ ను అధికారంలోకి తెచ్చుకోవడంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ వెళ్లినా, అంతరిక్షం పోయినా వక్రబుద్ధి మారదని తెలిపారు. కెసిఆర్ తెచ్చిన తెలంగాణలోనే రేవంత్ రెడ్డి వెలగబెట్టుతుండగా, రాష్ట్రం తేకుంటే ఆయనకు ముఖ్యమంత్రి పీఠం దక్కేదా? అని ప్రశ్నించారు. కెసిఆర్ ప్రజల బాగోగులు ఆలోచిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం బూతు మాటల్లో శిక్షణ పొందుతున్నట్లు విమర్శించారు. రెండున్నర ఏండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్ లో తట్ట మట్టి ఎత్తలేదని, రైతు బంధు డబ్బులు ఎలక్షన్ల తర్వాత అంటూ రేవంత్ రెడ్డి జూటా మాటలు చెప్తున్నట్లు స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లోపు రైతులకు రైతు బంధు ఇవ్వక పోతే ఆయనను ప్రజలు చీరి చెంతకు కడతారని అన్నారు. రాష్ట్రాన్ని ఆగం చేసిన రేవంత్ రెడ్డికి దమ్ముంటే అభివృద్ధిలో కేసీఆర్ తో పోటీ పడాలని, బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే వచ్చే ప్రభుత్వంలో నైనా అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తం అవుతుండగా, బూతులు మాట్లాడడం తప్ప, రఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని రేవంత్ రెడ్డికి మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని వివరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, వైస్ జకియోద్దీన్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి

### ప్రభుత్వ సలహదారు,ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/బోధన్:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బోధన్ పట్టణంలోని 38వార్డులలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ మేజార్టీతో గెలిపించి, మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పట్టణ ప్రజలను కోరారు. గురువారం పట్టణంలోని 37వ వార్డు అభ్యర్థి ఆది నారాయణకు మద్దతుగా వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీతోనే పట్టణాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ ఛైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూము శరత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా 'మచ్కూరి'ఎన్నిక



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షునిగా ఎడపల్లి ఉప సర్పంచి మచ్కూరి గంగాధర్ ఎన్నికయ్యారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఫోరం ఉపాధ్యక్షులుగా జాన్కంపేట్ ఉప సర్పంచి నీలం కృష్ణ, జక్కు రజిత(పోచారం), భార్గత్(జైతాపూర్), ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ బషీర్(ఎమ్మెస్సీ ఫారం), కార్యదర్శులుగా చింతవారి రవి, బాబా, కోశాధికారిగా రామస్వామి ఎన్నికయ్యారు. అలాగే ప్రచార కార్యదర్శిగా కొండెంగల కాకయ్య, ముఖ్య సలహాదారులుగా నందాకి శేఖర్, బాబన్నలను ఎన్నిక చేశారు. మిగతా వారు కార్యవర్గ సభ్యులుగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ.. ఉప సర్పంచుల సమస్యలను పరిష్కరించడం, తమ హక్కులను కాపాడటం, పంచాయతీరాజ్ వ్యవస్థలో తమ పాత్రను బలోపేతం చేయడం కోసం ఏర్పాటు చేయబడిన వేదికలే ఉప సర్పంచుల ఫోరం అని అన్నారు. గ్రామ అభివృద్ధిలో ఉప సర్పంచుల బాధ్యతలను గుర్తించి, ప్రభుత్వానికి డిమాండ్లను తెలియచేయడానికి, అలాగే చట్టపరమైన అధికారాలను పొందడానికి కృషి చేస్తామని, ఉప సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

## నిర్వాసితుల సమస్యల పరిష్కారం కెసిఆర్ తోనే సాధ్యం

### ఎంపిటిసిల ఫోరం

### రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్



**ప్రజాపక్షం / గజ్వేల్ :** నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కేసీఆర్ తోనే సాధ్యపడుతుందని దీనిని దృష్టిలో పెట్టుకొని బిఆర్ఎస్ బలపరిచిన ఏడో వార్డు అభ్యర్థి నేతి చిన్న సంతోష్ గుప్తకు ఓటర్లు మద్దతు పలకాలని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ పేర్కొన్నారు. గురువారం మల్లన్న సాగర్ ముంపు గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు బాధితుల త్యాగం వెలకట్టలేనిదని, అయితే వారికి ఇచ్చిన ప్యాకేజీలు, హామీలు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు గజ్వేల్ మున్సిపల్ పరిధిలో బిఆర్ఎస్ జండా ఎగరాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా యువకుడు, నిజాయితీపరుడైన ఎన్సీ సంతోష్ గుప్త పేదలకు నిస్వార్థంగా సేవలు అందించేందుకు ముందుకు రాగా, ప్రతిక్షణం ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటున్న విషయాన్ని గుర్తు చేశారు. అలాగే గత పది ఏళ్లుగా సేవా సంస్థల ద్వారా పేదలను ఆర్థికంగా తీర్చిదిద్దుతున్న సంతోష్ గుప్త కుటుంబం గజ్వేల్ అభివృద్ధికి బాటలు వేసిందని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన తండ్రి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త పట్టణాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దగా, శాశ్వత పనులకు ప్రాధాన్యత ఇచ్చి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రింగురోడ్డు నిర్మాణం, రైల్వే లైన్ ఏర్పాటు, సమీకృత భవన సముదాయం, వెజ్ నాన్ వెజ్ మార్కెట్, మహతి ఆడిటోరియం, ఎడ్యుకేషన్ హబ్, రోడ్ల విస్తరణ, ప్రభుత్వ ఆసుపత్రులు తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత కేసిఆర్ కే దక్కిందని వివరించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో... బిఆర్ఎస్ నేతలు శిక్ష తప్పదు

### బిజెపి మహిళా విభాగం

### రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ

**ప్రజాపక్షం / గజ్వేల్:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి విజయ డంకా మోగిస్తుందని బిజెపి మహిళా విభాగం అధ్యక్షురాలు ఆకుల విజయ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై బిజెపి లక్ష్యంగా విమర్శలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శిక్ష పడుతుందనే భయంతో కేటీఆర్ హరీష్ రావులు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నట్లు ఎద్దేవా చేశారు. చట్ట వ్యతిరేకమని తెలిసినప్పటికీ సొంత కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ చేసిన దరిద్రులు వాళ్లని నిలదీశారు. గత బిఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలు చోటు చేసుకోగా, అదే దారిలో సీఎం రేవంత్ రెడ్డి ముందుకెళ్తున్నట్లు విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీకి బిజెపి భయం పట్టుకుందని, అందుకే బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు ఆరోపించారు. తామే నిధులు కేటాయించామని చెప్పుకున్న హరీష్ రావు దమ్ముంటే గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాకు వచ్చి నిరూపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా, పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదని నిలదీశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకున్న హరీష్ రావు నిధులను, అభివృద్ధి పథకాలను సిద్దిపేటకు తరలించినట్లు విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బిఆరెస్ పార్టీ, హరీష్ రావుకు ప్రజలు తగిన బుద్ధి చెపుతారని తెలిపారు. దేవుడు వరం ఇచ్చినా పూజారి అడ్డు పడినట్లు చేసిన వ్యక్తి హరీష్ రావు కాగా, మజీద్ ముందున్న డబ్బాలను తీపిస్తే వాళ్ళకు ఇప్పటికీ న్యాయం చేయలేదని నిలదీశారు. అవసరాలను మరిచి, అవసరం లేని నిర్మాణాలు చేపట్టి కమిషన్లు దండుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు సింగం సత్తయ్య, కప్పర ప్రసాదరావు, ఎల్లు రాంరెడ్డి, నందన్ గౌడ్, మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి బంద్

### మాజీ మంత్రి వేములప్రశాంత్‌రెడ్డి నిప్పులు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మున్సిపాలిటీ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని, గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పనులన్ని కుంటుపడ్డాయని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. భీమ్‌గల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం భాగంగా 7, 11, 12 వార్డుల బీఆర్ఎస్ అభ్యర్థులు అస్లాం, రాజునాయక్, మల్లెల అనుపమప్రసాద్ గెలుపును ఆకాంక్షిస్తూ ఆయన విస్తృతంగా ప్రచారంనిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తారు. అభివృద్ధికి బాటలు వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని 200 కోట్ల నిధులు గ్రామంగా ఉన్న భీమ్‌గల్‌ను మున్సిపాలిటీగా మార్చి కేసీఆర్, కేటీఆర్ సహకారంతో రూ.200 కోట్లతో అభివృద్ధిచేసిన ఘనత తమదేనన్నారు. మౌలిక సదుపాయాలు రూ.25 కోట్లతో 80 వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని రూ. 20 కోట్లతో ఫోర్‌లైన్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి పట్టణ రూపురేఖలు మార్చామని గుర్తు చేశారు. తాగునీటి కష్టాల పరిష్కారం రూ.30 కోట్లతో చేపట్టిన ఆస్పత్రి పనులు రూ.6 కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందని ప్రశ్నించారు.

**డిపో మూసివేత :** గతలో తాము ఎంతో కష్టపడి తెరిపించిన బస్సు డిపోను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ మూసివేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు.

**ఎన్నికల డ్రామాలు :** అసెంబ్లీ ఎన్నికల ముందే తాము రూ.10 కోట్లు మంజూరు చేస్తే (జిఓ నెం.548) రెండేళ్లుగా ఆ పనులు ఆపేసి, ఇప్పుడు ఎన్నికలు రాగానే శంకుస్థాపనలు చేయటం కాంగ్రెస్ డ్రామా అనివిమర్శించారు.

**బీజేపీపై విమర్శలు :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేవుడి పేరుతో రాజకీయం చేస్తోందే తప్ప తెలంగాణ అభివృద్ధికి ఒక్క పైసా కూడా అదనంగా ఇవ్వలేదని విమర్శించారు.

**ముగింపు :** అభివృద్ధికి పట్టంకట్టాలని, కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## స్వయం భూ శివాలయంలో ఘనంగా మహాపడి పూజ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులో వెలిసిన స్వయం భూ శివాలయం వద్ద భక్తిశ్రద్ధలతో శివ స్వాముల మహా పడి పూజ గురువారం నిర్వహించారు. జాన్కంపేట్ గ్రామ శివారులో స్వయం భూ వెలిసిన ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న స్వయం భూ శివాలయం ప్రాంగణంలో మహా పడిపూజ చేశారు. ఈ సందర్భంగా భక్తి పాటలతో అలరించారు. శివనామం స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పు సురేష్, శివమాల ధారణ స్వాములు, స్థానిక నాయకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

